




హనుమకొండలోని హరిత హోటల్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు. పక్కన మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు దాస్యం వినయ్‌భాస్కర్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్, తాటికొండ రాజయ్య తదితరులు

# బిల్లులు రాకనే దేవాదుల మోటర్లు బంద్

## ఓఅండ్ఎం కాంట్రాక్టర్‌కు 7 వేల కోట్లు పెండింగ్ • ప్రాజెక్టు నీళ్లు అందక ఉమ్మడి వరంగల్ జిల్లాలో దాదాపు లక్ష ఎకరాల్లో పంటలు ఎండిపోయినయ్: హరీశ్‌రావు

- ఇది ముమ్మాటికీ రేవంత్ అసమర్థతతో వచ్చిన సంక్షోభం
- పాలన చేతగాక ప్రతిపక్షాలు, ప్రకృతిపైనా నిందలు
- ప్రజాపాలన కాదు.. 20 శాతం కమీషన్ల పాలన
- బాబుకు రేవంత్ గురుదక్షిణగా కృష్ణానీళ్ల చెల్లింపు
- రేవంత్‌పై నిప్పులు చెరిగిన మాజీ మంత్రి హరీశ్
- రజతోత్సవ సభ కోసం వరంగల్‌లో స్థల పరిశీలన



వరంగల్ నగర శివారులోని భట్టుపల్లిలో సభ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలిస్తున్న మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు

> తన గురువు చంద్రబాబునాయుడు కృష్ణా నీళ్లను దోచుకుంటున్నా రేవంత్ అడ్డుకునే ప్రయత్నం చేయలేదు. కనీసం మాట్లాడలేదు. ప్రజాభవన్‌కు చంద్రబాబును పిలిచి అడుగులకు మడుగులు ఒత్తింది రేవంత్‌రెడ్డి కాదా? బాబును ప్రశ్నించే దమ్ము ఆయనకు లేదు. ఉత్తమ్ కుటుంబ సమేతంగా చంద్రబాబు దగ్గరికి వెళ్లి భోజనం చేసి వచ్చిండు. రేవంత్ గురుదక్షిణగా కృష్ణా నీళ్ల చెల్లింపు కారణంగానే నల్లగొండ జిల్లాలో పంటలు ఎండుతున్నయి.
> - హరీశ్

వరంగల్, మార్చి 10 (నమస్తే తెలంగాణ ప్రతినిధి)/ జనగామ, (నమస్తే తెలంగాణ) : ప్రభుత్వ అసమర్థత కారణంగా లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆవేదన వ్యక్తంచేశారు. వానకాలంలో గోదావరి ప్రవాహం మొదలైన వెంటనే మోటర్లు ఆన్ చేసి రిజర్వాయర్లు, చెరువులు, కుంటలు నింపి ఉండాల్సిందని, సకాలంలో ఓఅండ్ఎం పనులు పూర్తిచేసుకొని ఎండాకాలం కోసం నీళ్లను సిద్ధం చేసుకొని ఉంటే రైతులకు ఇప్పుడీ దుస్థితి పట్టేది కాదని తెలిపారు. దేవాదుల ఓఅండ్ఎం కాంట్రాక్టర్‌కు రూ.7 వేల కోట్ల బిల్లులు చెల్లించకపోవడంతో 33 రోజులుగా మోటర్లు బంద్ అయ్యాయని, ఫలితంగానే కరువు వచ్చిందని చెప్పారు. రేవంత్ చేతగాని తనంతో ఒక్క ఉమ్మడి వరంగల్ జిల్లాలోనే లక్ష ఎకరాలు ఎండిపోతున్నాయని వాపోయారు. పోయినసారి కంటే ఈసారి వర్షాలు సమృద్ధిగా పడ్డాయని, వేలాది టీఎంసీల నీళ్లు గోదావరిలో కలిశాయని గుర్తుచేశారు. కేసీఆర్ ఉన్నప్పుడు నీళ్లను ఒడిసిపడితే.. రేవంత్‌రెడ్డి మాత్రం వృథాగా ఇడిశిపెట్టాడని ఎద్దేవాచేశారు. ప్రభుత్వంతో జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి పోరాడి, ఇరిగేషన్ మంత్రి, ఇరిగేషన్ సెక్రటరీ చుట్టూ తిరిగి 30 రోజులకు రూ.7 కోట్లు విడుదల చేయించుకొని మోటర్లను రిపేర్ చేయించారని చెప్పారు. ఇది వరకే మోటర్లను బాగు చేసి నడిపి ఉంటే భీంఘన్‌పూర్, చలివాగు, ధర్మసాగర్, గడ్డిరామారం, బొమ్మకూరు రిజర్వాయర్లను నింపుకొని తపాస్‌పల్లి దాకా నీళ్లు తెచ్చుకునే వాళ్లమని, ఇప్పుడు మోటర్లు ఆన్ చేసినా నీళ్లందని పరిస్థితి ఉన్నదని ఆందోళన వ్యక్తంచేశారు. 'ఇప్పటికే 60, 70 శాతం పంటలు ఎండిపోయినయి. జిల్లాలో కాంగ్రెస్ మంత్రులు, నాయకులు కనీసం పట్టించుకోరా? సమీక్షించరా? లక్ష ఎకరాల్లో పంట ఎండిపోతుంటే కాంగ్రెస్ నాయకులకు చీమ కుట్టినట్టయినా లేదా?' అని నిలదీశారు. వెంటనే దేవాదుల ఫేజ్-3 మోటర్లను ప్రారంభించి పంట పొలాలకు నీళ్లందించాలని, నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.20 వేల సాయం ప్రకటించాలని డిమాండ్ చేశారు. బీఆర్‌ఎస్ రజతోత్సవ బహిరంగ సభ స్థలం ఎంపిక, ఏర్పాట్ల పరిశీలనలో భాగంగా హరీశ్ సోమవారం వరంగల్‌లో పర్యటించారు. సభ కోసం నగర శివారులోని ఉనికిచర్ల, భట్టుపల్లిలో స్థలాలను పరిశీలించారు. అనంతరం హనుమకొండలోని హరిత హోటల్, జనగామ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శాసనమండలిలో ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి, మాజీ మంత్రులు వేముల ప్రశాంత్‌రెడ్డి, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, బీఆర్‌ఎస్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు దాస్యం వినయభాస్కర్, మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, బానోత్ శంకర్‌నాయక్, నన్నపునేని నరేందర్, తాటికొండ రాజయ్యతో కలిసి విలేకరుల సమావేశాల్లో మాట్లాడారు. 'రేవంత్‌రెడ్డి తనది 20-20 మ్యాచ్ అన్నడు మొన్న.. నిజమే ఫైనాన్స్‌లో బిల్లులు ఇవ్వాలంటే 20 శాతం కమీషన్, రెవెన్యూశాఖలో భూములకు క్లియరెన్స్ ఇవ్వాలంటే 20 శాతం కమీషన్, మున్సిపల్ శాఖలో అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలకు పర్మిషన్ ఇవ్వాలంటే 20 శాతం కమీషన్ ముట్టజెప్పాల్సిందే' అని దుయ్యబట్టారు.

> దేవాదుల ఓఅండ్ఎం కాంట్రాక్టర్‌కు రూ.7 వేల కోట్ల పెండింగ్ బిల్లులు చెల్లించకపోవడం వల్ల 33 రోజులు పంపుల మోటర్లు ఆన్ కాక కరువు వచ్చింది. దేవాదుల మోటర్లు ఆగకుండా నడిచి ఉంటే రిజర్వాయర్లు నిండేవి. పొలాలకు నీళ్లు వచ్చేవి. రేవంత్ చేసిన తప్పును ప్రకృతి మీద మోపుతున్నడు. నీళ్లు ఇవ్వొద్దని మోటర్లకు అడ్డంగా హరీశ్‌రావు గాని, బీఆర్‌ఎస్ నాయకులు గాని నిల్చున్నరా?
> - హరీశ్

### చంద్రబాబుకు గురుదక్షిణ

చంద్రబాబు నాయుడు కృష్ణా నీళ్లను దోచుకుంటుంటే రేవంత్‌రెడ్డి కనీసం మాట్లాడటం లేదని, బాబును ప్రశ్నించే దమ్ము ఆయనకు లేదని హరీశ్ మండిపడ్డారు. ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కూడా మౌనంగా ఉన్నారని విమర్శించారు. నీళ్ల రూపంలో తన గురువు చంద్రబాబుకు రేవంత్ గురుదక్షిణ చెల్లిస్తున్నాడని విమర్శించారు. 'రేవంత్ గురుదక్షిణ చెల్లింపు కారణంగా నల్లగొండ జిల్లాలో పంటలు ఎండుతున్నయి. ముఖ్యమంత్రి సొంత జిల్లా మహబూబ్‌నగర్‌లో కూడా పంటలు ఎండుతున్నయి. రెండు జిల్లాల్లో పంటలు ఎండిపోయేందుకు ఏపీ అడ్డగోలుగా కృష్ణానది జలాలను దోచుకోవడమే కారణం' అని మండిపడ్డారు. 'తెలంగాణ గురించి బీజేపీ అడగడం లేదు. మన సీతమ్మసాగర్, సమ్మక్క బరాజ్, బీఆర్ అంబేద్కర్ ప్రాజెక్టుల అనుమతులను పట్టించుకోవడంలేదు. రాయలసీమ ఎత్తిపోత పథకంపై కేసీఆర్ అలుపెరగని పోరాటం చేసిండు. పోతిరెడ్డిపాడుకు వ్యతిరేకంగా కాంగ్రెస్ ప్రభుత్వంలో ఉన్న ఆరుగురు బీఆర్‌ఎస్ మంత్రులం పదవులకు రాజీనామా చేసినం. ఇవ్వాళ తెలంగాణకు అన్యాయం జరుగుతున్నా మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డితోపాటు కాంగ్రెస్ నేతలు పదవుల కోసం పెదవులు మూసుకున్నారు. బనకచర్ల నుంచి గోదావరి జలాలను ఏపీ తరలించుకుపోతుంటే బీఆర్‌ఎస్ ఒక్కటే ప్రశ్నించింది' అని గుర్తుచేశారు. 'మొన్న ముఖ్యమంత్రి మాట్లాడుతూ ఎండలతో పంటలు ఎండిపోతుంటే కేసీఆర్, హరీశ్‌రావు సంతోష పడుతున్నరన్నడు.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ఉన్నప్పుడు, కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు కూడా ఎండలు కొట్టినయి. మరి ఆనాడు ఎందుకు పంటలు ఎండలేదు? ఈ రోజే ఎందుకు ఎండుతున్నయి?' అని నిలదీశారు. మండుటెండల్లోనూ వాగులు, వంకలు, చెరువుల్లో నీళ్లు ఉండేవని, ఎకరం కూడా ఎండకుండా కేసీఆర్ పాలనలో పంట పండిందని గుర్తుచేశారు.

### కేసీఆర్ మళ్లీ రావాలని ప్రజలు కోరుకుంటున్నరు

**తెలంగాణ** సాధనే లక్ష్యంగా బీఆర్‌ఎస్ చేసిన 14 ఏండ్ల పోరాటం, బంగారు తెలంగాణ లక్ష్యంగా పదేండ్ల పాలన మేళవింపే బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ అని హరీశ్ తెలిపారు. రజతోత్సవ వేడుకలు ఏడాదిపాటు కొనసాగుతాయన్నారు. కాంగ్రెస్ పాలనపై ప్రజలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారని, ఏ పార్టీ ఏమిటనేది స్పష్టత వచ్చిందని, వట్టి పార్టీ ఏదో, గట్టి పార్టీ ఏదో, మాటలు చెప్పేదెవరో, చేతల్లో చూపించేదెవరో ప్రజలకు అర్థమైందని చెప్పారు. కేసీఆర్‌ను చూడాలని, ఆయన మాట వినాలని, ఆయన మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. ఏప్రిల్ 27న వరంగల్‌లో బీఆర్‌ఎస్ రజతోత్సవ సభ నిర్వహించాలని పార్టీ అధినేత కేసీఆర్ నిర్ణయించారని, లక్షలాది మందితో సభ నిర్వహణకు ఏర్పాట్లు చేస్తున్నామని వివరించారు.

### రేవంత్ రాజీనామా చెయ్యాలె

ఎమ్మెల్సీ ఎన్నికలను కాంగ్రెస్ పాలనకు రెఫరెండం అని చెప్పిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన మాటకు కట్టుబడి పదవికి రాజీనామా చెయ్యాలని హరీశ్ డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి చెప్పినట్టు రెఫరెండంలో గ్రాడ్యుయేట్లు, టీచర్లు కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా తీర్పు ఇచ్చారని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో రేవంత్ ప్రచారం వల్లే ఆ పార్టీ అభ్యర్థి నరేందర్‌రెడ్డి ఓడిపోయారని తెలిపారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం రేవంత్‌రెడ్డి పని చేసి ఇప్పుడు బీఆర్‌ఎస్‌పై నిందలు వేస్తున్నారని విమర్శించారు. గ్రాడ్యుయేట్ ఎన్నికల్లో తమ వల్లే బీజేపీ గెలిచిందని చెప్తున్న రేవంత్‌రెడ్డి ఆయన ఎమ్మెల్యేగా ఉన్న కొడంగల్ ఎంపీగా బీజేపీ అభ్యర్థి డీకే అరుణ గెలవడంపై ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. రేవంత్‌రెడ్డి సిట్టింగ్ ఎంపీగా ఉన్న మల్కాజిగిరి లోక్‌సభ సెగ్మెంట్‌లోనూ బీజేపీ అభ్యర్థి గెలిచారని, వారి కోసమే రేవంత్ పని చేశారా? అని నిలదీశారు. రేవంత్ పీసీసీ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హుజూరాబాద్, మునుగోడు ఉప ఎన్నికల్లో కాంగ్రెస్‌కు డిపాజిట్ కూడా దక్కలేదని, ఆ ఎన్నికల్లో బీజేపీ గెలుపు కోసం పని చేసిన విషయం అందరికీ తెలుసని పేర్కొన్నారు. గుజరాత్ కాంగ్రెస్ పార్టీలో బీజేపీ కోవర్టులు న్నారని రాహుల్‌గాంధీయే చెప్పారని, తెలంగాణలోనూ ఆ పరిస్థితి ఉన్నదనే విషయం రాహుల్ చూసుకోవాలని సూచించారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాన్ని ప్రశ్నిస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తనను బాడీ షేమింగ్ చేస్తున్నారని, వారి వ్యాఖ్యలను వాళ్ల విచక్షణకే వదిలేస్తున్నానని చెప్పారు. 'పొడవు అనేది నాకు దేవుడు ఇచ్చిండు.. రేవంత్, భట్టి వ్యాఖ్యలు వాళ్ల కురచదనానికి నిదర్శనం' అని చెప్పారు.

### రైతుల ఆవేదన చూసి గుండె తరక్కుపోయింది : పల్లా

దేవాదుల నీటిపై ఆధారపడిన జనగామ నియోజకవర్గ రైతులను ఆదుకోవాలన్న చిత్తశుద్ధి లేని కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యంతో వేలాది ఎకరాల్లో పంటలు ఎండిపోతున్నాయని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. దేవాదుల మోటర్లు నడువక పంటలను ఎండుతున్నా జిల్లా మంత్రులు, ఎమ్మెల్యేలు పట్టించుకున్న పాపాన పోలేదని మండిపడ్డారు. రైతులు తనవద్దకు వచ్చి గోడు వెళ్లబోసుకుంటే గుండె తరుక్కుపోతున్నదని ఆవేదన వ్యక్తంచేశారు. రైతుల కన్నీళ్లు..కష్టాలను తీర్చేందుకు తనవంతుగా ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి అధికారులను నిలదీసినా చలనం లేదని మండిపడ్డారు.


> ప్రాజెక్టుల నుంచి నీళ్లు ఇవ్వక లక్షలాది ఎకరాల్లో పంటలు ఎండుతున్నయి. ఇది కాలం తెచ్చిన కరువు కాదు.. రేవంత్ చేతగానితనంతో వచ్చిన కరువు.. పాలన చేతగాక ప్రకృతిపైన, ప్రతిపక్షాలపైన నిందలు వేసి తప్పించుకొనే ప్రయత్నం చేస్తున్నడు. తెలంగాణకు పట్టిన గ్రహణం రేవంత్‌రెడ్డి.
> - హరీశ్

### అసలైన ప్రజావిప్లవం మిలియన్ మార్చ్ : హరీశ్

హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ) : తెలంగాణ ఉద్యమాన్ని ప్రపంచ ప్రజా ఉద్యమాల సరసన నిలిపిన అసలు సిసలు ప్రజావిప్లవం మిలియన్ మార్చ్ అని మాజీ మంత్రి హరీశ్‌రావు అభివర్ణించారు. నాటి కాంగ్రెస్ పాలకుల ఆంక్షలు, నిర్బంధాల కట్టడిని చిత్తు చేసి జలమార్గం గుండా ట్యాంక్‌బండ్‌కు చేరుకొని, మిలియన్ మార్చ్‌లో తాను పాల్గొన్న నాటి అపురూప దృశ్యాలను సోమవారం ఎక్స్‌వేదికగా పంచుకున్నారు. ఈ మహత్తర ఘట్టానికి నేటికి 14 ఏండ్లు పూర్తయ్యాయని, మిలియన్ మార్చ్‌తో తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున ఎగిసిపడిందని గుర్తుచేశారు. 'ఆంక్షల పద్మవ్యూహాన్ని బద్దలుకొట్టుకొని లక్షలాదిగా తరలివచ్చిన జనం.. స్వరాష్ట్ర సాధన కోసం ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమ ప్రస్థానంలో అదో కీలక ఘట్టం. ఆ అపురూప దృశ్యాలు ఇప్పటికీ కండ్లెదుట కదలాడుతున్నాయి. నాటి ఉద్యమ పోరాటాలను ఇంకా రగిలిస్తూనే ఉన్నాయి. అణువణువునా.. నిలువెల్లా ఉద్యమస్ఫూర్తిని జ్వలిస్తున్నాయి' అంటూ పోలీస్ నిర్బంధాలను ఛేదిస్తూ హుస్సేన్‌సాగర్‌లో చిన్న నాటుపడవలో గమ్యస్థానానికి చేరుకున్న ఫొటోలను పోస్ట్ చేశారు. స్వరాష్ట్ర సాధన కోసం కేసీఆర్ నాయకత్వంలో తెలంగాణ ప్రజలు చూపిన తెగువకు, పోరాటానికి సెల్యూట్ చేస్తున్నానని పేర్కొన్నారు. ప్రాణాలర్పించిన అమరులకు 'జై తెలంగాణ' అంటూ జోహార్లు అర్పించారు.

# కాంట్రాక్టర్ల జేబుల్లోకి రైతు భరోసా!


మొదటిపేజీ తరువాయి...


రైతుల అందరి ఖాతాల్లో జమ చేసే అవకాశం ఉండే కానీ ఏం జరిగిందో ఏమో..! ఒకేసారి కాకుండా విడతలవారీగా రైతు భరోసా నిధులు ఇవ్వాలని నిర్ణయించారు. ఈ అర్ధరాత్రి నుంచే భరోసా డబ్బులు రైతుల ఖాతాల్లో టకీటకీమని పడుతాయని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన జనవరి 26 నుంచి ఇప్పటివరకు మూడు విడతలు రూ.3,511 కోట్లు మాత్రమే విడుదల చేసింది. మిగిలిన డబ్బును కాంట్రాక్టు బిల్లుల చెల్లింపునకు వినియోగించినట్టు తెలిసింది. అంతేకాకుండా, రైతులకు విడుదల చేసిన నిధుల్లో కూడా కొంత భాగం మళ్లీ కాంట్రాక్టు బిల్లుల చెల్లింపులకే వినియోగించినట్టు సమాచారం.

### 45% మంది రైతుల సొమ్ము మళ్లింపు

మొదట ప్రయోగాత్మకంగా ప్రతి మండలంలో ఒక గ్రామాన్ని యూనిట్‌గా తీసుకొని 577 గ్రామాల్లోని 4.42 లక్షల మంది రైతులకు రూ.593 కోట్లు జమ చేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. మొదటి విడత కింద ఎకరం వరకు భూమి ఉన్న 17.03 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.557.54 కోట్లు జమ చేసింది. రెండో విడతలో రెండెకరాల వరకు భూమి ఉన్న 13.23 లక్షల మందికి రూ.1,091.95 కోట్లు చెల్లించింది. మూడో విడతలో మూడెకరాలలోపు భూమి ఉన్న 10.13 లక్షల మంది రైతులకు రూ.1,269.32 కోట్లువిడుదల చేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. అన్ని విడతలు కలిపి ఇప్పటివరకు మొత్తంగా రూ.3,511.82 కోట్లు విడుదలచేసినట్టు ప్రభుత్వం ప్రకటించింది. కానీ, ఇప్పటివరకు 45% మంది రైతుల ఖాతాల్లో డబ్బు జమ కాలేదని బ్యాంకు అధికారులు చెప్తున్నారు. ప్రభుత్వం విదిల్చిన సొమ్ములో రూ.1,800 కోట్లు మాత్రమే రైతుల ఖాతాల్లో జమ అయినట్టు తెలుస్తున్నది. మిగిలిన డబ్బును ప్రభుత్వ పెద్దలే వ్యూహాత్మకంగా కాంట్రాక్టర్ల ఖాతాల్లోకి మళ్లించినట్టు ఆర్థిక శాఖ అధికారులు గుర్తించినట్టు తెలిసింది. దాదాపు 1,700 కోట్ల రైతుభరోసా డబ్బును 15% నుంచి 20% కమీషన్లతో కాంట్రాక్టర్లకు చెల్లించినట్టు ఆర్థిక శాఖ గుర్తించినట్టు సచివాలయ వర్గాల్లో చర్చ జరుగుతున్నది.

### రైతు భరోసాతోనే కాంగ్రెస్ తొలి దందా!

అసెంబ్లీ ఎన్నికలకు ముందే రైతుల ఖాతాల్లో రైతుబంధు కింద పెట్టుబడిసాయం జమ చేయడానికి అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం రూ.7వేల కోట్లకుపైగా నిధులను సమాకూర్చి పెట్టింది. రైతుబంధు ద్వారా ఓటర్లను ప్రలోభపెట్టే అవకాశం ఉన్నదంటూ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేయడంతో ఈసీ ఆంక్షలు విధించింది. దీంతో ఆ డబ్బు రైతుల ఖాతాల్లో జత కాకుండా ఆగిపోయింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే తొలి చూపు ఈ నిధులపైనే పడ్డది. ఈ మొత్తం రూ.7 వేల కోట్ల డబ్బును కాంగ్రెస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి, మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నేతకు సంబంధించిన ఒక కాంట్రాక్టు సంస్థకు చెందిన ఏజెన్సీలకు గుండుగుత్తగా బిల్లులు చెల్లించినట్టు అప్పట్లో మీడియా వర్గాల్లో భారీ ఎత్తున ప్రచారం జరిగింది. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని గెలిపిస్తే, ఒక్కో సీజన్‌కు ఎకరానికి రూ.7,500 చొప్పున ఏడాదికి రూ.15 వేలు ఇస్తామని హామీ ఇచ్చిన కాంగ్రెస్ 2024 వానకాలం సీజన్‌లో రైతుభరోసా ఇవ్వలేదు. యాసంగి సీజన్‌లో ఒక్కో ఎకరానికి రూ.7,500కు బదులుగా రూ.6 వేలు మాత్రమే ఇస్తామని ప్రకటించింది. రిపబ్లిక్ డే సందర్భంగా తన సొంత నియోజకవర్గంలోని కోస్గి మండల కేంద్రంలో సీఎం రేవంత్‌రెడ్డి రైతుభరోసా పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు.

### సాగు భూములకూ రైతు భరోసా ఎగవేత

**సాగుయోగ్యం** కాని భూములకు రైతు భరోసా ఇవ్వబోమని చెప్పిన ప్రభుత్వం అలాంటి భూముల గుర్తింపునకు సర్వే చేసింది. ఈ సర్వే మొత్తం ప్రహసనంగా మారడంతో సాగుయోగ్యం కాని భూములతోపాటు పంటలు సాగు చేసిన భూములు సైతం బ్లాక్‌లిస్టులోకి ఎక్కాయి. ఒక సర్వే నంబర్‌లో పదెకరాల భూమి ఉంటే, అందులో సగం భూమి నేషనల్ హైవే కోసమో, ఇరిగేషన్ ప్రాజెక్టుల కాల్వలు, ఇతర అవసరాల కోసమో సేకరించిన చోట ఆ సర్వే నంబర్ మొత్తాన్ని బ్లాక్‌లిస్టులో పెట్టినట్టు సమాచారం. ఒక సర్వే నంబర్‌లో కొంత భూమిని ఇండ్ల స్థలాలుగా మారిస్తే.. ఆ సర్వే నంబర్‌ను మొత్తాన్ని బ్లాక్‌లిస్టు కింద చేర్చినట్టు తెలిసింది. దీంతో ఆయా భూములకు రైతుభరోసా దక్కకుండా పోతున్నది. ఇలా 22 వివాదాస్పద అంశాల కింద రాష్ట్రవ్యాప్తంగా మూడు లక్షల ఎకరాల వరకు బ్లాక్‌లిస్టులో పెట్టినట్టు వ్యవసాయ శాఖ నివేదికలు చెప్తున్నాయి. ఈ నిధులను కూడా రాష్ట్ర ప్రభుత్వ పెద్దలు కాంట్రాక్టర్ల బిల్లుల చెల్లింపులకు వినియోగించినట్టు తెలిసింది.

# రైతుభరోసాపై రేవంత్ పిల్లిమొగ్గలు

### మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఫైర్



హైదరాబాద్, మార్చి 10 (నమస్తే తెలంగాణ): 'రైతు భరోసాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పిల్లిమొగ్గలు వేస్తున్నారు. అర్హులైన రైతులందరికీ భరోసా అందిస్తామని చెప్పి సాగదీస్తూ ఇబ్బంది పెడుతున్నారు' అని బీఆర్‌ఎస్ నేత, మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. ఇప్పటి వరకు నాలుగు విడతల్లో మూడెకరాల్లోపు ఉన్న రైతులకు రూ.3,487 కోట్లు మాత్రమే విడుదల చేశారని ఒక ప్రకటనలో విమర్శించారు. మార్చి 31లోగా రైతులందరికీ రైతుభరోసా ఇస్తామని చెప్పి భూములు తాకట్టు పెట్టి రూ.10 వేల కోట్లు తెచ్చారని దుయ్యబట్టారు. మూడెకరాల వరకు రైతుభరోసాను కుదించే ఆలోచన చేస్తున్న సర్కారు.. ఐదెకరాల వరకు ఇస్తామని లీకులు ఇస్తున్నదని ఆరోపించారు. 1.48 కోట్ల ఎకరాలకు భరోసా ఇస్తామని ప్రకటించి, ఇప్పటివరకు 58.13 లక్షల ఎకరాలకు మాత్రమే ఇవ్వడం విడ్డూరమని పేర్కొన్నారు. పదేండ్లు ప్రగతిబాట పట్టిన వ్యవసాయం కాంగ్రెస్ పాలనలో తిరోగమిస్తున్నదని విమర్శించారు. ఇది ప్రజాపాలన కాదు.. రైతులను వేధించే పాలన అని నిప్పులు చెరిగారు. ఎకరాకు రూ.15 వేలు ఇస్తామని చెప్పి రూ.12 వేలకు కుదించడం అన్యాయమని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అర్హులందరికీ ఎకరాకు రూ.15 వేల చొప్పున రైతుభరోసా ఇవ్వాలని, లేకపోతే తమకు చేతకాదని అంగీకరించి ప్రజలకు క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు.

# రైతుల పాలిట శాపం కాంగ్రెస్ సర్కారు

- మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఫైర్



పెన్‌పహాడ్ మండలం గూడెపుకుంటతండాలో రైతుతో మాట్లాడుతున్న మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి

పెన్‌పహాడ్, మార్చి 10: రేవంత్‌రెడ్డి ప్రభుత్వం రైతుల పాలిట శాపంగా మారిందని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి ఆవేదన వ్యక్తంచేశారు. సూర్యాపేట జిల్లా పెన్‌పహాడ్ మండలం గూడెపుకుంట తండాలో ఎండిన పంటలను సోమవారం పరిశీలించారు. రైతుల గోడు విని ఓదార్చారు. అనంతరం మాట్లాడుతూ.. ఎండలకు ఎండిపోతే తనను తిడుతున్నారని రేవంత్‌రెడ్డి చెప్పడం సిగ్గుచేటని ఫైర్ అయ్యారు. కాంగ్రెస్ ప్రభుత్వం సకాలంలో సాగు నీరు ఇస్తుందని నమ్మిన రైతులు ఎస్సారెస్పీ కింద వేల ఎకరాల్లో సాగు చేశారని తెలిపారు. తీరా ఇప్పుడు నీళ్లు అందకపోవడంతో పొలాలు ఎండిపోతున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. లక్షల రూపాయలు పెట్టి బావులు తవ్వించినా, బోర్లు వేసినా చుక్క నీరు పడటం లేదని, రైతులు మనోవేదన చెందుతుండటం బాధగా ఉందని పేర్కొన్నారు. మళ్లీ కేసీఆర్ ప్రభుత్వం రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కొందరు రైతులు జగదీశ్వర్‌రెడ్డితో మాట్లాడారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు పంటలు బాగా పండాయని, ఇప్పుడు నీళ్లు లేక అరిగోస పడుతున్నామని వాపోయారు. జగదీశ్‌రెడ్డి వెంట సూర్యాపేట జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్‌గౌడ్, బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు దొంగరి యుగంధర్, మాజీ ఎంపీపీ నెమ్మాది భిక్షం, బీఆర్‌ఎస్ నాయకులు ఉన్నారు.



సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అచ్చుమాయిపల్లిలో ఎండిన వరిపంటను పరిశీలించి రైతును ఓదార్చుతున్న ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

# కాంగ్రెస్ పాలనలో రైతులకు కన్నీళ్లు

- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి

దుబ్బాక, మార్చి10: రైతులకు సాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు మాజీ సీఎం కేసీఆర్ రూ.వేల కోట్లతో ప్రాజెక్టులు నిర్మిస్తే, కాంగ్రెస్ ప్రభుత్వం ఆ ప్రాజెక్టుల నుంచి నీటిని ఇవ్వలేక దౌర్భాగ్యపు పాలన కొనసాగిస్తున్నదని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి మండిపడ్డారు. సోమవారం సిద్దిపేట జిల్లా దుబ్బాక మండలం అచ్చుమాయిపల్లి, కమ్మర్‌పల్లిలో ఆయన పర్యటించారు. మల్లన్న సాగర్ 4ఎల్ డిస్ట్రిబ్యూటర్ ఉప కాల్వల పనులతో పాటు, ఎండిన వరి పంటలను పరిశీలించారు. తలాపున మల్లన్నసాగర్ ఉన్నప్పటికీ దుబ్బాక నియోజకర్గంలో సాగునీటి సమస్య నెలకొనడం బాధకరమని ఆవేదన వ్యక్తంచేశారు.

# పంటల పరిరక్షణే ప్రభుత్వ కర్తవ్యం

### మంత్రులు ఉత్తమ్, తుమ్మల సమీక్ష

హైదరాబాద్, మార్చి 10(నమస్తే తెలంగాణ): చేతికొచ్చిన పంటను కాపాడటమే ప్రభుత్వ కర్తవ్యమని మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్పష్టంచేశారు. నీటిపారుదల శాఖాధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి, వాస్తవాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. ఈ మేరకు సచివాలయంలో సోమవారం మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారితో కలిసి కలెక్టర్లు, ఎస్పీలు, వ్యవసాయ, విద్యుత్తు శాఖాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ.. మరో 15 రోజుల్లో పంట చేతికి రానుండడంతో అధికారులు రైతులకు తోడ్పాటునందించాలని సూచించారు.